సాక్షి ఖమ్మం

సోమవారం । 14 । అక్టోబర్ । 2024



మాతల్లీ మైసమ్మ..

కారేపల్లి మండలంలో నిర్వహిస్తున్న శ్రీకోట మైసమ్మ తల్లి జాతరకు భక్తులు పోటెత్తటంతో ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. 8లో



..మహాలక్ష్మిలుగా తీర్చిదిద్దుతాం

మహిళలను మహాలక్ష్మిలుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ఎర్రుపాలెంలో ఇందిరా డెయిరీ యూనిట్‌ను ప్రారంభించారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లగా మారుతుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో నేడు తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్‌: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 4 గంటలకు రఘునాథపాలెం మండలం రజబ్‌ఆలీనగర్, 4.30 గంటలకు ఎన్వీ బంజర, 5 గంటలకు పంగిడి గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి తదితరులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెసర ప్రభాకర్‌రెడ్డిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ప్రభాకర్‌రెడ్డిని ఆహ్వానించారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా వినూత్నమైన బోధనా పద్ధతులు, డిజిటల్ వనరులను ఉపయోగిస్తూ ప్రభాకర్ రెడ్డి చేసిన సేవలను అభినందించారు. కార్యక్రమానికి అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రొఫెసర్ కోదండరాం, మేఘాలయ గవర్నర్ విజయ శంకర్, తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ తదితరులు హాజరయ్యారు.

విమానాశ్రయం ఏర్పాటుకు సన్నాహాలు

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో అంతర్భాగమైన రామవరం శివారు గరీబ్‌పేట వెళ్లే మార్గంలో 1000 ఎకరాల్లో విమానాశ్రయం ఏర్పాటుకు సన్నాహాలు సాగుతున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. స్పోర్ట్స్ కారిడార్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి రామవరంలోని లక్ష్మీగణపతి ఆలయ ఆవరణలో విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ రామవరం ప్రాంతాన్ని ఉభయ ఖమ్మం జిల్లాలో కీర్తి గడించేలా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు తనకు అధిక మెజారిటీ ఇచ్చారని తెలిపారు. రామవరంలోని 7 వార్డులు, 3 ఇంక్లెయిన్, చుంచుపల్లి పంచాయతీలను కలుపుకుని కార్పొరేషన్ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. రానున్న 2,3 ఏళ్లలో రామవరం రూపురేఖలు మారతాయని అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు మాట్లాడుతూ రామవరంలో పుట్టి పెరిగిన తాను ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని అన్నారు. సివిల్ జీఎం సూర్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు, టూ టౌన్ సీఐ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో భారీగా పదోన్నతులు

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో శనివారం రాత్రి భారీగా పదోన్నతులు కల్పిస్తూ జెన్‌కో యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఈ కేడర్ నుంచి ఎస్ఈ క్యాడర్ వరకు పదోన్నతులు లభించాయి. త్వరలోనే కొందరికి స్థానచలనం కూడా కలిగే అవకాశం ఉంది. కేటీపీఎస్ 7వ దశలో 23 మంది ఏఈలు ఏడీఈలుగా, 9 మంది ఏడీఈలు డీఈలుగా, డీఈ లలిత నుంచి ఎస్ఈగా పదోన్నతి పొందారు. కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలో 39 మంది ఏఈ నుంచి ఏడీఈలుగా, ఆరుగురు ఏడీఈ నుంచి డీఈలుగా, డీఈలు కె. సంజీవయ్య, కె.షర్మాష్‌వలీ ఎస్ఈలుగా పదోన్నతి పొందారు.


రామయ్యకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆదివారం, సెలవు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..

ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం ఎదురుచూపులు

- రూ.109 కోట్ల బకాయిలు అందక విద్యార్థులకు తప్పని అవస్థలు
- ఉన్నత చదువులకు అడ్డంకిగా మారిన పెండింగ్‌లు
- ఉమ్మడి కార్యాచరణకు పూనుకుంటున్న విద్యాసంస్థలు



ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు కలిపి మొత్తం బకాయిలు..

బీసీ, ఈబీసీ	: రూ. 52,54,75,000
మైనార్టీ సంక్షేమ శాఖ	: రూ. 21,34,87,000
ఎస్సీ సంక్షేమ శాఖ	: రూ. 30,00,00,000
గిరిజనసంక్షేమ శాఖ	: రూ. 6,00,00,000
మొత్తం	: రూ. 109,89,62,000

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.109 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రావాల్సి ఉంది. అయితే ఇందులో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అత్యధికంగా ఉన్నాయి. దీంతో వివిధ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు అందక, ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు విద్యాసంస్థల యాజమాన్యాలు కూడా బకాయిలు విడుదల కాకపోవడంతో నిర్వహణ భారం మోయలేకపోతున్నాయి. ఈ క్రమంలో నిరసన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం.

పేరుకుపోయిన బకాయిలు..

జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. బీసీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి 2021 – 22 సంవత్సరం నుంచి బకాయిలు రావాల్సి ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.47,40,08,000 బకాయిలు ఉన్నాయి. ఇక ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.30 కోట్లకు పైగానే ఉన్నాయి. అయితే ఆయా విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసినప్పటికీ ఈ కుబేర్‌లో ఆగిపోయాయి. దీంతో కళాశాలల ఖాతాల్లోకి నగదు జమ కాకుండా పెండింగ్‌లో ఉంది. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రూ.3 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. మైనార్టీ శాఖ మినహా బీసీ, ఈబీసీ, గిరిజన సంక్షేమశాఖ, ఎస్సీ సంక్షేమ శాఖల నుంచి రూ.80,40,08,000 బకాయి ఉంది.

మైనార్టీ సంక్షేమానికి రూ. 21.34 కోట్లు..

మైనార్టీ సంక్షేమ శాఖలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు కలిపి రూ.21,34,87,000 రావాల్సి ఉండగా.. అందులో 4,75,05,000 మంజూరైనా ఈ కుబేర్‌లో ఆగిపోయాయి. మిగిలిన 16,59,81,000 నిధులు మంజూరు కావాల్సి ఉంది. అలాగే బీసీ, ఈబీసీ, మైనార్టీ, ఎస్సీ, గిరిజన శాఖల విద్యార్థులకు సంబంధించి రూ.8,14,67,000 ఉపకార వేతనాలు అందాల్సి ఉంది.

బోధనలో కొరవడుతున్న నాణ్యత..

ప్రభుత్వం నుంచి విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య అందడం లేదనే విమర్శలున్నాయి. కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో ఆయా విద్యాసంస్థలు టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీకి వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని తెలుస్తోంది. కొన్ని విద్యాసంస్థల్లో ఐదారు నెలలకు పైగా వేతనాలు చెల్లించకపోవడంతో విద్యాబోధనపై సిబ్బంది అంతగా దృష్టి సారించడం లేదని సమాచారం. ఇక విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కూడా కుంటుపడుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి బకాయిలు వస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థి సంఘాలు, యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

కార్యాచరణకు సిద్ధం..

ఫీజు రీయింబర్స్ బకాయిలు రెండేళ్లుగా విడుదల కాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు కార్యాచరణకు సిద్ధం అవుతున్నాయి. రూ.కోట్లలో బకాయిలు ఉండటంతో కళాశాలల నిర్వహణకు ఇబ్బందిగా మారినట్లు తెలుస్తోంది. కనీసం బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ క్రమంలో విద్యాసంస్థల్లో బోధనను నిరవధికంగా బంద్ చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సమాచారం. అయితే ఇటీవల ఖమ్మంలో సమీక్ష సమావేశం నిర్వహించిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇప్పటి వరకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను చెల్లిస్తామని చెప్పారు. చెల్లింపులో ఆలస్యం జరిగితే ఆందోళనకు దిగాలనే ఆలోచనలో కళాశాలల యాజమాన్యాలు ఉన్నట్లు తెలుస్తోంది.

విద్యార్థుల అవస్థలు..

గత రెండు, మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఇక కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఉన్నత చదువులకు, ఇంటర్వ్యూలకు వెళ్లాలంటే సర్టిఫికెట్లు తప్పనిసరి. అయితే ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు చెబుతుండడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో విద్యార్థులు ఉన్నారు. తప్పనిసరి పరిస్థితిలో కొందరు ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుంటుండగా.. పేద విద్యార్థులు మాత్రం ఫీజు చెల్లించలేక ఆందోళనకు గురవుతున్నారు. ఇంటర్వ్యూలకు వెళ్లేందుకు సర్టిఫికెట్లు లేక అనేక అవకాశాలను వదులుకుంటున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల ఆందోళనలు కూడా చేపట్టారు.

వైభవంగా దసరా వేడుకలు





జమ్మిబండ వద్ద లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్) స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

- జమలాపురంలో శ్రీరాజరాజేశ్వరీ దేవిగా అమ్మవారి దర్శనం
- ఖమ్మంలో జమ్మిబండపై ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం/ఖమ్మం గాంధీచౌక్ : జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలు వైభవంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో జమ్మిచెట్టు వద్ద పూజలు, రావణ వధ వంటి కార్యక్రమాలు చేశారు. తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీవారికి పంచామృతంతో అభిషేకాలు చేశారు. శ్రీ అలివేలుమంగ అమ్మవారు శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వామివారి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా శమీ పూజ నిర్వహించగా, భక్తులకు అన్నదానం చేశారు.

జమ్మిబండపై దసరా మహోత్సవం..

ఖమ్మం నగరంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగాయి. సంప్రదాయ పద్ధతిలో పారువేట, శమీ పూజ నిర్వహించారు. ఖమ్మానికి తలమానికంగా ఉన్న గుట్టపై వెలసిన శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై ఆలయం నుంచి స్వామి వారిని పల్లకి సేవగా జమ్మిబండపై భక్తుల దర్శనార్థం ఉంచారు. శమీ పూజ అనంతరం శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జమ్మిబండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి నగర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. నగర వీధులు భక్తులతో కిటకిటలాడాయి.

ఉద్యోగ సంఘాల జేఏసీ పునర్నిర్మాణం



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాలతో కలిసి జేఏసీ పునర్నిర్మిస్తున్నామని ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో అన్ని ఉద్యోగ సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి సుమారు 18 వేల మంది ఉన్నారని, వీరందరితో కలిసి త్వరలో సకల ఉద్యోగుల సామూహిక వన భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల డీఏలు, పీఆర్సీ, హెల్త్ కార్డులు తదితర అంశాలపై చర్చించారు. టీఎన్జీవోస్ కో కన్వీనర్ కొణిదన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఏసీ వైస్ చైర్మన్ దేవరకొండ సైదులు, నాయకులు జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, గంగవరపు బాలకృష్ణ, గుంటుపల్లి శ్రీనివాస్, ఎర్రా రమేష్, వల్లపు వెంకన్న, పెద్దినేని శ్రీనివాసరావు, రవిచంద్ర, ప్రకాష్, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ఉపాధ్యాయ సంఘాల నేతలు యలమద్ది వెంకటేశ్వర్లు, రాయల నరసింహారావు, జి.వి.నాగమల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, కొమ్మినేని అనిల్ కుమార్, ఎం.సురేష్, రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు దొడ్డ పుల్లయ్య, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మామునూరి రాజేష్, గంటా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వేలం దిశగా స్వగృహ

- 17ఏళ్ల క్రితం పోలెపల్లిలో రాజీవ్ స్వగృహ ఇళ్ల నిర్మాణం
- చివరి దశలో నిలిచిన పనులు
- వేలంలో విక్రయించాలని తాజాగా ప్రభుత్వ నిర్ణయం
- ఇప్పటికే డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లింపులు



రాజీవ్‌స్వగృహ ఇళ్ల సముదాయం

ఖమ్మంరూరల్: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2007లో ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లిలో రాజీవ్ స్వగృహ ఇళ్లు నిర్మించారు. మధ్యతరగతి ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. అప్పటి ప్రభుత్వం ప్రైవేట్ కాంట్రాక్టర్లకు నిర్మాణ బాధ్యతను అప్పగించింది. అయితే సదరు కాంట్రాక్టర్‌లు ఇళ్లకు స్లాబ్‌లు వేసి, ప్లాస్టింగ్ పనుల వరకు పూర్తి చేశారు. ఇక వైఎస్ మరణానంతరం నాటి నుంచి ఇళ్లు ఖాళీగానే ఉంటున్నాయి. నిర్మాణానికి ముందే మధ్య తరగతి ప్రభుత్వోద్యోగులకు ఇళ్లు కేటాయించాలని నిర్ణయించి అర్హులైన వారి నుంచి రూ.3 వేల చొప్పున డిపాజిట్ తీసుకున్నారు. డిపాజిట్ చేసిన ఉద్యోగులు 15 ఏళ్లుగా ఇళ్ల కేటాయింపు కోసం ఎదురుచూశారు. అయితే ఎంతకూ లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదు. దీంతో డిపాజిట్‌దారులు స్వగృహ ఇళ్లు వేలంలో ఇతరులకు విక్రయించకుండా తమకే కేటాయించాలంటూ అప్పట్లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అయినా అప్పటి ప్రభుత్వం డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి వారికి చెల్లించింది.

వేలంలో ఇళ్ల అమ్మకం..

రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం ద్వారా విక్రయించాలని స్వయంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా డిపాజిట్ చేసిన రూ.3వేలు తిరిగి తీసుకెళ్లాలని, ఇళ్లకు కొత్తగా వేలం వేసి విక్రయిస్తున్నట్లు తెలిపింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని, ఇందులో ఎవరూ ఏమీ చేసేది లేదని, వెంటనే డిపాజిట్ తీసుకెళ్లాలని చెప్పిన నాటి కలెక్టర్ డిపాజిట్‌లు కూడా వెనక్కి ఇచ్చేశారు. ఇది చాలా అన్యాయమని, ఇళ్లు కేటాయిస్తామని డిపాజిట్ చేయించుకొని 15 ఏళ్ల తర్వాత ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సబబు కాదని డిపాజిట్‌దారులు అప్పట్లో వాపోయారు. అయినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో డిపాజిట్‌దారులు చెల్లించిన సొమ్మును తిరిగి ఇచ్చేసింది. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఖజానాను ఎంతో కొంత నింపడానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా రాజీవ్‌స్వగృహ ఇళ్లను వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు.

పేదలకు కేటాయించాలి..

ప్రభుత్వం ప్రజల ఆస్తులను అమ్మడం సరికాదని, ప్రజలకు, ఉద్యోగులకు ఇస్తామని చెప్పి ఇప్పుడు వేలం ద్వారా రాజీవ్ స్వగృహ ఇళ్లను విక్రయిస్తామని చెప్పడం ఏమిటని ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని గతంలో డిపాజిట్ చేసిన వారితో పాటు పేద, మధ్యతరగతి వారికి ఇళ్లు కేటాయించాలని ఆయా పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వేలం నిర్ణయం సరికాదు..

దివంగత సీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి ఎంతో ఉదారతతో రాజీవ్ స్వగృహ ఇళ్లను ప్రభుత్వ మధ్యతరగతి ఉద్యోగులకు కేటాయించేలా నిర్మాణం చేపట్టారు. తదనంతర కాలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వగృహ ఇళ్లను వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. దీంతో అప్పట్లో ఈ నిర్ణయంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇళ్లను వేలం వేయాలనడం సరికాదు. స్వగృహ ఇళ్లను అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలకు సబ్సిడీపై పంపిణీ చేయాలి.

– నంద్ర ప్రసాద్, సీపీఎం మండల కార్యదర్శి

రైతులే గొంతు విప్పాలి

- పదేళ్లలో రుణమాఫీ చేయని బీఆర్ఎస్ విమర్శలకు సమాధానం చెప్పాలి
- 15 రోజుల్లో రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశాం
- ఆయిల్‌పాం సాగుదారులకు దసరా కానుకగా పవర్ ప్లాంట్..
- ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు జారె, రాగమయి, కూనంనేని, రాందాస్ తదితరులు

అశ్వారావుపేట: గడిచిన పదేళ్లలో రుణమాఫీ చేయని, గిట్టుబాటు ధర కల్పించని బీఆర్ఎస్.. రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేసిన ప్రజాప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రుణమాఫీ పొందిన రైతులే గొంతు విప్పి ఆ పార్టీ వారికి సమాధానం చెప్పాలన్నారు. అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో రూ.36.5 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల బయోమాస్ పవర్‌ప్లాంట్‌ను రాష్ట్ర రెవెన్యూ, వ్యవసాయ శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన రైతు సదస్సులో భట్టి మాట్లాడుతూ 15 రోజుల్లో రూ.18 వేల కోట్ల రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హులైన వారు సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ పొందలేకపోతే వ్యవసాయ అధికారి వద్ద తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి రైతుకూ రూ.2 లక్షల లోపు రుణాన్ని నూరుశాతం మాఫీ చేస్తామని అన్నారు. ఆపై రుణం ఉన్నవారు మిగిలిన రుణం జమ చేస్తే రూ.2 లక్షలు మాఫీ చేస్తామన్నారు. ప్రజాప్రభుత్వమే రైతుల తరుపున బీమా ప్రీమియం ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లిస్తుందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నడూ రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో రూ.73వేల కోట్లు కేటాయించిందన్నారు. సన్నరకం వరిని ప్రోత్సహించేందుకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రకృతి వనరులతో విద్యుదుత్పత్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సోలార్ పవర్ ప్లాంట్‌లను పైలట్ ప్రాజెక్టులుగా ఏర్పాటు చేస్తామని, రైతుల పొలాల్లో సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. పామాయిల్ అధికంగా సాగవుతున్న అశ్వారావుపేట ప్రాంతంలో రైతులు ముందుకు వస్తే పైలట్ ప్రాజెక్టుగా రెండు గ్రామాలను ఎంపిక చేస్తామన్నారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తి మేరకు పామాయిల్ తోటల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లను మళ్లిస్తామని హామీ ఇచ్చారు. 1990లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం చుట్టారని, ప్రస్తుతం దేశంలో తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి: వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏపీలో నర్సరీలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారని, తెలంగాణలోని నర్సరీలకు కూడా ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కోరారు. అనుకున్న సమయానికి రుణమాఫీ చేయలేకపోయామని, డిసెంబర్ 9 సోనియాగాంధీ పుట్టిన రోజు నాటికి రూ.31 వేల కోట్లు రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. రైతు భరోసాను కూడా సిద్ధం చేస్తున్నామని, రెండో పంటకు రైతు బీమా చెల్లిస్తామని వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.3 వేల కోట్లు ప్రీమియం చెల్లించాల్సి వచ్చినా సీఎం రేవంత్ రెడ్డి అంగీకరించారని తెలిపారు. గతంలో పంట నష్టపోయిన వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించినా, రైతులకు అది ఊరట కాదని, పంట బీమానే ఇందుకు పరిష్కారమని చెప్పారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, డాక్టర్ మట్టా రాగమయి, కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చని తివాచీలా : రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హెలీకాప్టర్ నుంచి చూస్తే అశ్వారావుపేట ప్రాంతం పచ్చని తివాచీ పరిచినట్లుంటుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇక్కడి రైతులు అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు చేయడం హర్షణీయమని అన్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వ్యర్థాలు ఒక్క కిలో కూడా వృథా కాకుండా కాప్టివ్ ప్లాంట్ ద్వారా విద్యుదుత్పత్తి చేయవచ్చని అన్నారు.

క్లుప్తంగా

కారేపల్లి సంతలో తేనెటీగల దాడి

చెల్లాచెదురై పరుగులు పెట్టిన జనం



చికిత్స పొందుతున్న బాధితులు

కారేపల్లి: కారేపల్లి వారాంతపు సంతలో ఆదివారం తేనెటీగలు బీభత్సం సృష్టించాయి. సంతలో ఉన్న చెట్లకు పెట్టిన తేనెతెట్టెలు ఒక్కసారిగా కదలటంతో తేనెటీగల గుంపు సంతలో ఉన్న వారిపై దాడి చేశాయి. సంతలో ఉన్న బేరగాళ్లతో పాటు కొనుగోళ్లకు వచ్చిన ప్రజలు, మేకలు, గొర్రెలు సైతం ఒక్కసారిగా చెల్లాచెదురయ్యాయి. ఇల్లెందు – డోర్నకల్ ప్రధాన రహదారిపైకి వచ్చి.. సమీపంలో ఉన్న భారత్ నగర్ కాలనీలోని నివాసాల్లోకి పరుగులు తీసి తలుపులు వేసుకోవాల్సి వచ్చింది. తేనెటీగల దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడగా.. కొందరు స్వల్పంగా గాయపడ్డారు. తులిస్యా తండాకు చెందిన వాంకుడోతు సూక్య, గుంపెళ్లగూడేనికి చెందిన ధరావత్ బాలు, రాజలింగాలకు చెందిన కొమ్మిని శ్రీనివాస్, కారేపల్లికి చెందిన అజ్మీర జుంకీలాల్‌కు గాయాలు కావటంతో.. వారిని స్థానికులు కారేపల్లి పీహెచ్‌సీకి తరలించారు. కాగా, తేనెటీగల దాడిలో రెండు మేకలు మృతి చెందటం గమనార్హం.

పిచ్చికుక్క స్వైరవిహారం

22 మందిని కరిచిన వైనం



కుక్కకాటుకు గురైన బాధితుడు

సత్తుపల్లి: పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. వీధిలో కనబడినవారిపై దాడిచేసిన గాయపర్చింది. శనివారం విద్యానగర్‌రోడ్‌లో నుంచి వచ్చిన కుక్క ఏకంగా 22 మందిని కరవటంతో స్థానికులు కర్రలు చేతపట్టుకొని వెంబడించి చంపేశారు. బాధితులకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో మృతి చెందిన కుక్కను తరలించారు. కాగా, కుక్కను ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తలపై కొట్టడంతో ఈ విధంగా ప్రవర్తించిందని స్థానికులు చెబుతున్నారు. అయితే, మున్సిపల్ అధికారులు కుక్కలను నియంత్రించటంలో పూర్తిగా విఫలమయ్యారంటూ శనివారం అంతా సోషల్ మీడియాలో గుంపులు, గుంపులుగా ఉన్న కుక్కల ఫొటోలను వైరల్ చేశారు.

అమ్మవారికి బంగారు బొట్టుబిళ్ల బహూకరణ



బంగారు బొట్టుబిళ్లను ఈఓకు అందజేస్తున్న చక్రధర్‌రావు, అరుణ దంపతులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఏటూరునాగారానికి చెందిన భక్తులు కె.చక్రధర్‌రావు, అరుణ దంపతులు రూ.1.20 లక్షల విలువైన బంగారు బొట్టుబిళ్లను బహూకరించినట్లు సోమవారం ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

తండ్రి గొంతు కోసిన తనయుడు

దమ్మపేట: మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే నెపంతో ఓ కొడుకు తన తండ్రి గొంతు కోయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని వడ్లగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంభంపాటి సత్యనారాయణ మద్యానికి బానిసై కుటుంబసభ్యులను తరచుగా వేధించేవాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం మత్తులో ఉన్న సత్యనారాయణ తన తండ్రి కృష్ణయ్య(75)ను మద్యం కోసం డబ్బులు ఇవ్వమని వేధించగా లేవని చెప్పడంతో తండ్రిని మంచం మీద పడేసి కత్తితో గొంతును కోశాడు. గమనించిన కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని వెంటనే సత్తుపల్లి ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మాతల్లీ.. మైసమ్మ..



శ్రీకోటమైసమ్మ తల్లి జాతర వ్యూ

- భక్తులతో పోటెత్తిన శ్రీకోటమైసమ్మ జాతర
- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య
- జాతరలో ప్రత్యేక ఆకర్షణగా సర్కస్ ఫీట్లు

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారమై, కోరినవారి కోర్కెలు తీర్చే తల్లి శ్రీకోటమైసమ్మ అని భక్తులు భావిస్తుంటారు. శ్రీకోటమైసమ్మ తల్లి జాతరకు భక్తులు పోటెత్తటంతో ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. కోటమైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. మండలంలోని ఉసిరికాయపల్లి గ్రామం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణానికి సరిహద్దులో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతర ఏటా ఐదు రోజులపాటు జరుగుతుంది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగే శ్రీకోటమైసమ్మ తల్లి జాతరలో రెండోరోజు ఆదివారం వేలాదిమంది భక్తులతో కిక్కిరిసింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే జాతరకు.. కారేపల్లి, కామేపల్లి మండలాలతో పాటు సరిహద్దు జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు, టేకులపల్లి మండలాలు, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల నుంచి భక్తులు వస్తుంటారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ప్రభ బండ్లతో ఊరేగింపుగా శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణానికి ఒకరోజు ముందుగానే చేరుకొని,



జాతరలో వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు

మూడు రోజుల పాటు బస చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవటం ఇక్కడ ఆనవాయితీ.



శ్రీకోటమైసమ్మ తల్లి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

● ఆకర్షణలు ఎన్నో..

జాతరలో ఏర్పాటు చేసిన సోలాపూర్ సర్కస్ ఫీట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సర్కస్ ఫీట్లు జాతరకు వచ్చిన భక్తులకు ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని సైతం నింపాయి. జాయింట్ వీల్స్, క్రాస్ వీల్స్, సాలొంబో, కొలొంబో, చిన్నారులకు బోటింగ్, డ్రాగన్ ట్రెయిన్‌లు ఎక్కి చిన్నారులు, పెద్దలు ఉల్లాసంగా గడిపారు. కాగా, శ్రీకోటమైసమ్మ తల్లి జాతరకు వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య రాగా.. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు కుటుంబ సభ్యులతో హాజరై తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

● పోలీసుల బందోబస్తు

జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు ఎస్.రాజారాం, సాయికుమార్, సిబ్బందిబందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యేలకు తృటిలో తప్పిన ప్రమాదం..

ఇల్లెందు నుంచి ఓసీ, సోలార్ ప్లాంట్ రోడ్డు మీదుగా 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉసిరికాయలపల్లి శ్రీకోటమైసమ్మ జాతరకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వాహనంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ బయలు దేరారు. సోలార్ ప్లాంట్ సమీపంలో మూలమలుపు వద్దకు వాహనం రాగా, రోడ్డు ప్రక్కన ప్రజలు గుమికూడి ఉండటంతో ఒక్కసారిగా ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న వాహనానికి సడన్‌బ్రేక్ వేశారు. వెనకాల వస్తున్న కాన్వాయిలో మూడు వాహనాలు ఒక దానికి ఒకటి ఢీకొని ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న వాహనాన్ని వెనుకనుంచి ఢీకొట్టాయి. ఎమ్మెల్యేలు



ఎమ్మెల్యేల కాన్వాయిలో ధ్వంసమైన వాహనం

ప్రయాణిస్తున్న వాహనంతోపాటు మరో మూడు వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. ఎవరికీ ప్రమాదం జరకగపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ రాజారాం స్పందించి.. ట్రాఫిక్ క్లియర్ చేశారు. ధ్వంసమైన వాహనాలను ఖమ్మం తరలించారు.

మహిళలను మహాలక్ష్మిలుగా తీర్చిదిద్దుతాం



ఇందిరా డెయిరీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

ఇందిరా డెయిరీ యూనిట్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి

ఎర్రుపాలెం: రాష్ట్రంలోని మహిళలను మహాలక్ష్ములుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఇందిరా డెయిరీ మిల్క్ చిల్లింగ్ యూనిట్‌ను ప్రారంభించి మాట్లాడారు. దసరా రోజు మొదలు పెట్టిన ఇందిరా మహిళా డెయిరీ విజయవంతమై దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మొత్తం మహిళలతో నిర్వహించే డెయిరీ పరిశ్రమను సందర్శించడానికి దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి అధికారులు, మహిళా సంఘాల సభ్యులు భవిష్యత్‌లో క్యూ కడతారని చెప్పారు. పాల ఉత్పత్తి కోసం ప్రభుత్వం రెండు గేదెలను పంపిణీ చేస్తుందని, అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు ప్రతి మండలంలో అంబులెన్సు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 2010లో ఈ ప్రాజెక్టు గురించి ఆలోచన చేశానని, గుజరాత్‌లోని అమూల్, ముల్కనూరు డెయిరీలను అధ్యయనం చేశామని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరా డెయిరీని పూర్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ గణేశ్, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండారు నర్సింహారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, లక్ష్మణ్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పూర్ణచంద్రారెడ్డి సేవలు అభినందనీయం

ఎర్రుపాలెం: సొంత నిధులతో పుట్టిన ఊరు కోసం యరమల పూర్ణచంద్రారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. శనివారం రాత్రి మండలంలోని భీమవరం గ్రామానికి వచ్చిన ఆమెకు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కేపీఆర్ హోమ్స్ అధినేత యరమల పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. గజమాలతో సత్కరించారు. తొలుత స్థానిక శ్రీసాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి, బతుకమ్మ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నందని మాట్లాడారు. గ్రామంలోని 8 మంది పేదలకు పూర్ణచంద్రారెడ్డి తన సొంత స్థలాన్ని అందించి, పట్టాలను నందిని చేతుల మీదుగా అందజేశారు. పూర్ణచంద్రారెడ్డిని నందిని అభినందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, అనుమోలు కృష్ణారావు, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు రామారావు, వేజెండ్ల సాయి, శీలం శారద, అనుమోలు శ్రీదేవి, గుర్రాల శ్రీనివాసరెడ్డి, యరమల శ్రీనివాసరెడ్డి, శీలం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

మండలంలోని బనిగండ్లపాడు గ్రంథాలయానికి భీమవరం గ్రామానికి చెందిన కేపీఆర్ హోమ్స్ అధినేత, కాంగ్రెస్ మండల నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి గ్రూప్స్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థుల కోసం రూ.12 వేల విలువచేసే



ఇళ్ల స్థలాల పట్టాలు అందిస్తున్న మల్లు నందిని



పూర్ణచంద్రారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పుస్తకాలను వితరణ చేశారు. ఆదివారం దాత పూర్ణచంద్రారెడ్డిని మాజీ సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డితో పాటు పలువురు సత్కరించారు. కార్యక్రమంలో యన్నం పిచ్చిరెడ్డి, యన్నం సత్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి వెంకటరెడ్డి, బొగ్గుల రామచంద్రారెడ్డి, ఖమ్మంపాటి లక్ష్మణ్, వేమిరెడ్డి రామిరెడ్డి, నరాల సాంబశివారెడ్డి, వెదురు కృష్ణారెడ్డి, తల్లపురెడ్డి వెంకటరెడ్డి, కోనా సాయి, శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

అనారోగ్యానికి తోడు అయినవారు దూరమయ్యారనే మనస్తాపం



ధనేకుల సాంబశివరావు, సరోజిని (ఫైల్)

ఎర్రుపాలెం: ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉన్నప్పటికీ.. అనారోగ్య సమస్యలతో పాటు అయినవారు అందుబాటులో లేరనే మనస్తాపంతో వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఎర్రుపాలెం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఎర్రుపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ ధనేకుల సాంబశివరావు(75), భార్య సరోజిని(65) పదేళ్ల క్రితం మండల కేంద్రానికి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉండగా ఇద్దరికీ వివాహాలు చేశారు. కుమారుడు రాంబాబు ఉద్యోగ రీత్యా యూకేలో, కుమార్తె ఏపీలోని తుమ్మలపాలెంలో ఉంటున్నారు. కాగా సాంబశివరావు కొంతకాలంగా గుండె జబ్బుకు గురై మందులు వాడుతుండగా సరోజిని కూడా చాలా కాలంగా పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. అయినవారు దూరమయ్యారని, ఆరోగ్యం సరిగా లేదని, భవిష్యత్‌లోనూ బాగుపడుతుందనే నమ్మకం లేనందున తనువు చాలిస్తున్నామని ఈనెల 11వ తేదీన డైరీలో రాసుకున్నారు. తాము పలువురికి అప్పుగా ఇచ్చిన రూ.32,31,450 రావాల్సి ఉందని, బ్యాంకులకు, ఇతరత్రా చెల్లించాల్సినవి రూ.4.66 లక్షలు ఉన్నాయని రాసి ఇద్దరూ సంతకం చేశారు. కుమారుడు, కుమార్తెకు చెందాల్సిన స్థిర, చరాస్తుల వివరాలు కూడా డైరీలో రాశారు. కాగా, శనివారం రాత్రి ఇద్దరూ పురుగుల మందు తాగి ఈ విషయాన్ని కుమారుడు, కుమార్తెకు వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలియచేశారు. దీంతో వారు స్థానికులను అప్రమత్తం చేయగా, ఇరుగు పొరుగు వారు వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే 108 అంబులెన్స్‌లో మధిర ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపారు.

ఫైనాన్స్ వేధింపులు తాళలేక...



వెంకటనారాయణ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: మైక్రో ఫైనాన్స్ వేధింపులతో ఓ కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మంలోని వైఎస్సార్ నగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ కథనం ప్రకారం.. వైఎస్సార్ నగర్‌లో నివాసం ఉంటున్న తాటికొండ వెంకటనారాయణ(47) స్వగ్రామం వైరాలో తన సమీప బంధువుల వద్ద గ్రూప్‌లో చేరి మైక్రో ఫైనాన్స్‌లో కొంత మొత్తం అప్పు తీసుకున్నాడు. వాయిదాల ప్రకారం సొమ్ము తిరిగి చెల్లించడం లేదంటూ ఫైనాన్స్ ఇచ్చిన వారు వేధింపులకు పాల్పడున్నారు. ఇటీవల వెంకటనారాయణ దంపతులు కారేపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లగా, ఫైనాన్స్ కంపెనీ వారు అక్కడికి వెళ్లి వారిని బలవంతంగా వైరాకు తీసుకెళ్తూ బకాయి చెల్లించాలంటూ వేధించసాగారు. కాగా, ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్ వద్ద బస్సు ఆగడంతో కిందకు దిగిన వెంకటనారాయణ అందరూ చూస్తుండగానే సాగర్ ప్రధాన కాల్వలో దూకాడు. గల్లంతైన వెంకటనారాయణ కోసం గాలించగా మృతదేహం లభ్యమైందని, మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు మాధురి, గోపి, ఉమ, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. సాగర్ కాల్వలో మృతదేహాన్ని గుర్తించి అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సభ్యుల ద్వారా బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. వేధింపులతోపాటు, వెంటాడటంతో అవమానంగా భావించి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య చెపుతోంది. కేవలం బకాయి ఉన్న రూ. 6 వేల కోసం ఈ దారుణానికి పాల్పడినట్లు, దీనిపై విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కారు బోల్తా.. ఒకరు మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు



మోహినుద్దీన్ అలీ మృతదేహం, గాయపడిన వారిని 108లో తరలిస్తున్న సిబ్బంది

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కారు బోల్తా పడి, ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం కస్బాబజార్‌కు చెందిన సయ్యద్ మోహినుద్దీన్ అలీ, ఎంఏ హమీద్ ఖాన్, హుర్ జహాన్ హైదరాబాద్‌లో తమ బంధువుల వివాహానికి హాజరై కారులో వస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు ప్రైవేట్ బస్సులో వస్తున్నారు. కారు మునిగేపల్లి క్రాస్ రోడ్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టి డివైడర్ మధ్యలోని ఖాళీ స్థలంలో పడింది. కారు వెనుకనే బస్సులో వస్తున్న బంధువులు కారులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు యత్నించగా డోర్లు బిగుసుకుపోయి తెరచుకోలేదు. దీంతో రహదారిపై వెళ్తున్న వాహనదారులు, హైవే సిబ్బందితో పాటు బంధువులు కారును పైకి లేపి డోర్లను సుత్తి, ఇనుప కడ్డీలతో తొలగించారు. సయ్యద్ మోహినుద్దీన్అలీ (57) అక్కడికక్కడే మృతిచెందగా.. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఎన్‌హెచ్ సిబ్బంది 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ మహ్మద్ షఫీక్ అహ్మద్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపటంతోనే కారు బోల్తా కొట్టిందని, ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి బంధువు ఎంఏ మహమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

బొలేరో వాహనం పల్టీ.. ఒకరికి గాయాలు

మణుగూరుటౌన్: బొలేరో వాహనం పల్టీ కొట్టడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. మండలంలోని ఓబీ కంపెనీ మెనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆదివారం మణుగూరుకు బొలేరోలో వస్తున్నాడు. గుట్టమల్లారం సమీపంలోకి రాగానే వాహనం పల్టీ కొట్టింది. తీవ్రంగా గాపడని వ్యక్తిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వాహనంలో ఇద్దరు ఉండగా తృటిలో ప్రమాదం తప్పింది.

ఇరు వర్గాలపై కేసు

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామంలో మిర్చి మొక్కలు తొలగించారని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవటంతో ఆదివారం ఇరు వర్గాలపై కేసు తల్లాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బి.కొండల్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దుగ్గిదేవర అప్పారావు 33 కుంటల భూమిలో మిర్చి సాగు చేశాడు. 10 కుంటల్లోని మిర్చి మొక్కలను ఆదివారం ఉదయం దుగ్గిదేవర వెంకయ్య, దుగ్గిదేవర రామారావు తొలగించారు. దుగ్గిదేవర వెంకయ్యకు చెందిన పొలంలో నాలుగు కుంటల విస్తీర్ణంలో దుగ్గిదేవర అప్పారావు మిర్చి మొక్కలు తొలగించాడు. ఇరు వర్గాలు తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ మోటార్ చోరీ

తల్లాడ: మండలంలోని కొడవటిమెట్టలో విద్యుత్ మోటార్ చోరీకి గురైన ఘటనపై ఆదివారం తల్లాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ కొండల్‌రావు కథనం ప్రకారం.. వైరా మండలం స్టేజీ పినపాకకు చెందిన తన్నీరు నర్సింహారావుకు కొడవటిమెట్టలో పొలం ఉంది. వైరా రిజర్వాయర్ కాల్వకు విద్యుత్ మోటారు పెట్టుకొని నీళ్లు వాడుకుంటున్నాడు. ఈ నెల 8న విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. చుట్టుపక్కల రైతులను అడగగా మోటార్ ఆచూకీ దొరకలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతరకు వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

కామేపల్లి: బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. శనివారం మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోకినపల్లి శ్రీనివాస్ ఖమ్మంలో ఓ ప్రైవేట్ స్కూల్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కారేపల్లి మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీ కోటమైసమ్మతల్లి జాతరకు వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకుని తిరిగి బైక్‌పై వెళ్తున్న క్రమంలో కామేపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయి మృతిచెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో బెటాలియన్ హెడ్‌కానిస్టేబుల్...



వీరాస్వామి (ఫైల్)

సత్తుపల్లిరూరల్: గంగారం 15వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సోయం వీరాస్వామి(38) శుక్రవారం రాత్రి గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. ఈనేపథ్యాన శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని బెటాలియన్ కమాండెంట్ చటర్జీ, అధికారులు సందర్శించి నివాళులర్పించారు. వీరాస్వామి స్వగ్రామం భద్రాచలం కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.


కారు ఢీకొని గొర్రెలు మృతి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు గొర్రెల మందను ఢీకొట్టగా 16 గొర్రెలు మృతిచెందాయి. నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కాంచాని వెంకన్న తన గొర్రెల మందను మేతకు తోలుకెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదుతో ఎస్‌ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన గొర్రెలు

క్లుప్తంగా...



సీఎం చంద్రబాబును కలిసిన చిరంజీవి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సినీ నటుడు చిరంజీవి శనివారం హైదరాబాద్‌లో కలిశారు. వరద బాధితుల సహాయార్థం రూ.కోటి చెక్కు అందజేశారు. ఇటీవలి వరదల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కలిసి తలో కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం చిరంజీవి తన రూ.50 లక్షల చెక్కుతో పాటు రామ్ చరణ్ రూ.50 లక్షల చెక్కును.. మొత్తం కోటి రూపాయల చెక్‌లను అందజేశారు.

– సాక్షి, హైదరాబాద్

డీకేజెడ్ టెక్నాలజీ స్కాంపై ఈడీ విచారణ

హవాలా, మనీలాండరింగ్ జరిగినట్లు గుర్తింపు



సాక్షి, హైదరాబాద్ : వివిధ రకాల స్కీములు పేరుతో, అధిక వడ్డీ ఆశ చూపి భారీ కుంభకోణాలకు పాల్పడిన డీకేజెడ్ కంపెనీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆరా తీస్తున్నారు. సదరు సంస్థ మొత్తం 17,500మంది బాధితుల నుంచి రూ.229 కోట్లు వసూలు చేశారు. ఈ భారీ మోసం కేసులో కీలక నిందితులను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ఇటీవలే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరికొందరు నిందితుల కోసం సీసీఎస్ పోలీసులు గాలిస్తున్నాయి. అయితే డీకేజెడ్ సంస్థ కొల్లగొట్టిన సొమ్ముతో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా పెద్ద మొత్తంలో హవాలా జరిగినట్లు ప్రాథమికంగా ఆధారాలు లభించడంతో ఈడీ రంగంలోకి దిగింది.

చక్రస్నానంతో సేద తీరిన స్వామి

ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలకు వీడ్కోలు



పుష్కరిణిలో చక్రస్నానాన్ని ఆచరిస్తున్న దృశ్యం

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. 9వ రోజు శనివారం ఉదయం 3 గంటల నుంచే పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవంతో స్వామివారు వరాహస్వామి ఆలయానికి చేరుకున్నారు. 9 రోజులపాటు వివిధ వాహనాల్లో ఊరేగిన అలసి సొలసిన స్వామి..స్నపన తిరుమంజనం సేవలో సేద తీరారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గర్భాలయంలోని మూలమూర్తి అంశమైన సుదర్శన చక్రాత్ అళ్వార్‌కు పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఆగమ శాస్త్రోక్తంగా గరుడపతాకాన్ని కిందకు దించి బ్రహ్మోత్సవాలను ముగించారు. చక్రస్నానంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప పాల్గొన్నారు.

వైభవంగా 'భాగ్‌సవారి'ఉత్సవం

తిరుమలలో ఆదివారం సాయంత్రం భాగ్‌సవారి ఉత్సవాన్ని టీటీడీ నిర్వహించింది. స్వామివారి ఉత్సవమూర్తులను తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ అనంతాళ్వారు తోటకు వేంచేశారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటి రోజు తిరుమలలో 'భాగ్‌సవారి'ఉత్సవం నిర్వహిస్తారు.


ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా మహోత్సవాలు

చివరి రోజు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారి దర్శనం



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన విజయదశమి రోజున దుర్గమ్మ శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. శనివారం ఉదయం చండీహోమం మండపంలో పూర్ణాహుతితో రుత్వికులు ఉత్సవాలకు ముగింపు పలికారు. శనివారం, ఆదివారాలు ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కూడా అమ్మవారికి అదే అవతారాన్ని కొనసాగించారు. ఉత్తరాంధ్ర నుంచి భారీగా వచ్చిన భవానీలతో విజయవాడ పరిసర ప్రాంతాలు కిక్కిరిసాయి. విజయదశమి సాయంత్రం దుర్గమ్మను కృష్ణానదిలో తెప్పోత్సవం పేరుతో హంసవాహనంపై విహరింపజేస్తారు. ఈ ఏడాది నదిలో 40–50 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతుండటంతో తెప్పోత్సవానికి నీటిపారుదల శాఖ నుంచి అనుమతి లభించలేదు. దీంతో దుర్గాఘాట్ లోనే హంసవాహనంపై గంగా సమేత శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను అధిష్ఠింపజేసి వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

చంద్రబాబు ఆరోపణల వెనుక కుట్ర కోణం



ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ డాక్టర్ సుబ్రమణ్యస్వామి

- శ్రీవారి ప్రసాదం కల్తీ అయిందని ఏ ఆధారంతో చెబుతారు?
- జూలైలో నివేదిక వస్తే సెప్టెంబర్ దాకా ఏం చేశారు?
- దర్యాప్తు చేయకుండా కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఎలా ప్రకటిస్తారు?
- సుప్రీంకోర్టును సైతం కలవరపెట్టే ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి
- ఏపీ సిట్‌తో వాస్తవాలు బయటపడవనే సుప్రీంకోర్టు జోక్యం కోరాను

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదే పదే ప్రకటించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పేర్కొన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని ఆరోపించడం ప్రపంచాన్ని కలవర పెట్టిందని అన్నారు. ప్రజల మనోభావాలను ప్రభావితం చేసే ఇలాంటి అంశాలను బహిరంగంగా ప్రకటించే ముందు దర్యాప్తు చేయాలన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తిరుమల లడ్డూపై వచ్చిన ఆరోపణలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి క్రైస్తవ ముద్ర వేసేందుకు చేసిన సందర్భాలను సైతం ఆయన ఇక్కడ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మీడియా సంస్థల బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపారు. ఏపీ ప్రభుత్వం నియమించిన సిట్‌తో వాస్తవాలు తేలవని, అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఆ ఇంటర్వ్యూలో ఆయన ఇంకా ఏమన్నారంటే..

> నెయ్యి శాంపిల్స్ పరీక్షలు చేసి, టీటీడీ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో వెనక్కు పంపించామని టీటీడీ ఈవో రిపోర్టులో స్పష్టంగా ఉన్నప్పటికీ, కల్తీ జరిగిందని సాక్షాత్తు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పదే పదే బహిరంగంగా ప్రకటించడం దేనికి నిదర్శనం? ఇలా ఆరోపణలు చేశాక దర్యాప్తుకు ఆదేశిస్తారా? నిజానిజాలు నిర్ధారించుకోకుండా భక్తుల్లో అలజడి సృష్టించడానికి యత్నించడం కుట్ర కోణంగా భావించక తప్పదు.
>
> – ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ డాక్టర్ సుబ్రమణ్యస్వామి

జగన్ సీఎం అయినప్పటి నుంచి ఇదే వైఖరి

- తిరుమల బాలాజీ లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని స్వయంగా ముఖ్యమంత్రే గత నెల 18న బహిరంగంగా ఆరోపించారు. ఆ తర్వాత ప్రసాదం కల్తీపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమిస్తున్నట్లు సెప్టెంబర్ 26న ప్రకటించారు. ఇలాంటి తీవ్రమైన ఆరోపణ చేసేటప్పుడు సీఎం స్థాయిలో ఉన్న వారు వాస్తవమా.. కాదా అని తొలుత దర్యాప్తు చేసి నిర్ధారించుకోవాలి.
- కానీ ఇక్కడ అలా జరగలేదు. ముందు ఆరోపణ చేసి తర్వాత సిట్ దర్యాప్తు అన్నారు. పైగా కల్తీపై దర్యాప్తు కోసం అదే ప్రభుత్వం సిట్‌ను నియమించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అనుకోవడం లేదు. జూలైలో కల్తీ జరిగిందని చెప్పి.. ఇంత కాలం తర్వాత ఇప్పుడు ఎందుకు సిట్‌ని నియమించారు? పైగా గత ప్రభుత్వంపై, నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన మంత్రులపై చాలా పెద్ద ఆరోపణలు చేశారు.
- జగన్ సీఎం అయినప్పటి నుంచి తిరుపతిలో క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారని ఓ ప్రణాళిక ప్రకారం ఆరోపణలు చేస్తూ వచ్చారు. తద్వారా నాటి సీఎం వైఎస్ జగన్‌పై మత ముద్ర వేసేందుకు చాలా ప్రయత్నం చేశారు. 2019లో సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు కూడా ఇదే రకమైన ఆరోపణలు చేశారు. ఒక క్రైస్తవుడిని టీటీడీ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని హిందూవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- వాస్తవమేంటంటే సుబ్బారెడ్డి గురించి తెలిసిన వారిని ఎవరిని అడిగినా ఆయన హిందువనే చెబుతారు. ఆయన 32 సార్లు మాల వేసుకుని శబరిమలకు వెళ్లివచ్చారు. ఇంట్లో గోశాల నిర్వహిస్తూ గోవులకు పూజ చేస్తున్నారు. ఇప్పుడు లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిపోయిందని చంద్రబాబు నాయుడు పత్రికల్లో పతాక స్థాయిలో స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఇందులో సుప్రీంకోర్టును సైతం కలవరపెట్టే అంశాలు చాలా ఉన్నాయి. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించాను. ప్రస్తుతం ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ప్రత్యేక సిట్‌ను నియమించింది.

తప్పుడు వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జూలైలో నెయ్యి శాంపిల్ తీసుకుని టెస్ట్ చేశారని టీటీడీ రిపోర్టులో ఉంది. ఆ రిపోర్టులో కల్తీ జరిగిందని గానీ, ఫిష్ ఆయిల్, కొవ్వు కలిసిందని గానీ ఎక్కడా లేదు. నెయ్యి నాణ్యత టీటీడీ ప్రమాణాలకు తగ్గట్టుగా లేనందున తిప్పి పంపించామని ఉందే తప్ప ప్రసాదం తయారీకి పంపించామని ఎక్కడా చెప్పలేదు. కాబట్టి ఒక అబద్ధాన్ని సృష్టించి.. విస్తృతంగా ప్రచారం చేశారన్నది వాస్తవం. ఇలాంటప్పుడు కల్తీ జరిగిందని ఎలా చెబుతారు? ప్రసాదంపై చేసిన ఆరోపణ కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసేది. ఆరోపణలు చేయడం సులువే, కానీ వాటిని నిరూపించాలిగా!
- వార్తాపత్రికలు కూడా జవాబుదారీగా ఉండాలి. రాజకీయ నాయకులు లడ్డూ ప్రసాదం, ఆలయ అంశాలను సమస్యగా మార్చి తమ గ్రాఫ్ పెంచుకునే ప్రయత్నం చేయవద్దని సుప్రీంకోర్టు గట్టిగానే చెప్పింది. ఈ హెచ్చరికను ప్రజలు ప్రశంసించారు. ఒకరి గుర్తింపును, ఎదుగుదలను రాజకీయంగా నాశనం చేసేందుకు తప్పుడు వార్తలను ప్రచారం చేసే ఏజెన్సీలు సైతం ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

జిల్లా వార్తలు

శబరియాత్రకు ఈఓ ఆహ్వానాలు



పొదెం వీరయ్యకు ఆహ్వానం అందిస్తున్న ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 17న జరగనున్న శబరి స్మృతి యాత్రకు రావాలని పలువురు ప్రముఖులను ఆదివారం ఈఓ ఎల్.రమాదేవి ఆహ్వానించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఆహ్వాన పత్రికలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో సోమవారం జరిగే గిరిజన దర్బార్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

కిన్నెరసానికి దసరా తాకిడి

రెండు రోజుల ఆదాయం రూ.1,09,710



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి దసరా సందర్భంగా పర్యాటకుల తాకిడి పెరిగింది. శని, ఆదివారాల్లో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కిన్నెరసాని ప్రాజెక్టు సమీపం నుంచి జలాశయాన్ని, నీటి విడుదలను, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 1247 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.59,195 ఆదాయం లభించగా, 1,145 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.50,515 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆరు దశాబ్దాల తర్వాత అవకాశం!

- ఇల్లెందు మార్కెట్ చైర్మన్‌గా స్థానిక నేత
- ఇప్పటివరకు మండలానికి దక్కని అభివృద్ధి ఫలాలు
- ఈసారి చైర్మన్ పదవి రావడంతో రైతుల్లో ఆశలు
- గోదాంలు, రైతు బజార్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని సూచన



ఇల్లెందు మార్కెట్ కార్యాలయం

ఇల్లెందురూరల్: ఇల్లెందు నియోజకవర్గంలో అతిపెద్ద మండలం, విశాలమైన వ్యవసాయ భూభాగం, ఇతర మండలాలకు భిన్నంగా అన్ని రకాల పంటలను సాగు చేసే రైతాంగం.. కలగలిపిన ఇల్లెందు మండలం ఆరు దశాబ్దాలుగా వ్యవసాయ మార్కెట్ యార్డు పరంగా నిరాదరణకు గురవుతోంది. పన్నులు వసూలు చేయడం మినహా సేవలందించాలన్న కనీస ధర్మాన్ని పాలకవర్గాలు, అధికారులు ప్రదర్శించలేకపోయారు. దీంతో ఎలాంటి ఫలాలు రైతులకు దక్కలేదు. అయితే, ఈసారి చైర్మన్‌గా మండల వాసికి అవకాశం దక్కడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అప్పుడు.. మళ్లీ ఇప్పుడే

ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ 1975 మే 4వ తేదీన ప్రారంభమైంది. ఈ మార్కెట్ పరిధిలో ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి, కారేపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం మండలాలు ఉన్నాయి. ఇల్లెందు మార్కెట్ యార్డుకు తొలి చైర్మన్‌గా నెమరుగొమ్ముల రాఘవేంద్రరావు(ఇల్లెందు పట్టణం) వ్యవహరించారు. ఆ తర్వాత వరుసగా దమ్మీలాల్ (ఇల్లెందు పట్టణం), ఏపూరి చినరామలింగయ్య(కామేపల్లి మండలం), నలమాసు రాజన్న(టేకులపల్లి మండలం), గౌరిశెట్టి సత్యనారాయణ(గుండాల మండలం), రావూరి వెంకట్రామయ్య(గార్ల మండలం) నియమితులయ్యారు. 2006లో రావూరి వెంకట్రామయ్య ఎన్నికైనప్పుడు గార్ల మండలానికే చెందిన గిరిజనులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు అనుగుణంగా ఆ తర్వాత నుంచి గిరిజనేతరులకు ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పదవులు దక్కడం లేదు. దీంతో 2008 ఫిబ్రవరి 22 నుంచి 2016 అక్టోబర్ 21 వరకు ప్రభుత్వం నియమించిన పర్సన్ ఇన్‌చార్జ్ నేతృత్వాన మార్కెట్ కార్యకలాపాలు కొనసాగాయి. తిరిగి 2016 అక్టోబర్ 22న భూక్యా నాగేశ్వరరావు(గార్ల మండలం), 2020 డిసెంబర్ 19 వరకు బానోత్ హరిసింగ్(టేకులపల్లి మండలం) మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కొనసాగారు. మళ్లీ ఆరు దశాబ్దాల తర్వాత ఈసారి ఇల్లెందు మండల వాసి బానోత్ రాంబాబుకు చైర్మన్ గిరీ దక్కింది.

సేవలకు దూరమై..

ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏర్పాటైన నాటి నుంచి ఇల్లెందు మండలంలో రైతులు పండించిన పంటల విక్రయాల ద్వారా వచ్చిన సెస్ రూ.కోట్లలో ఉంటుంది. కానీ మార్కెట్ ద్వారా ఈ మండలానికి చెప్పుకోదగిన సౌకర్యమేదీ రాలేదు. నాబార్డు ద్వారా కారేపల్లి, కామేపల్లిలో ఒకటి చొప్పున, గుండాల, టేకులపల్లిలో రెండు చొప్పున వ్యవసాయ ఉత్పత్తుల గోదాంలను నిర్మించారు. ఇతర నిధులతో ఇల్లెందు పట్టణం, గార్లలో నాలుగు చొప్పున, బయ్యారంలో రెండు, టేకులపల్లిలో ఒక గోదాం నిర్మించారు. కానీ మొక్కజొన్న, పత్తి, వరి పంటలతోపాటు ఉద్యాన పంటలైన మిర్చి, కూరగాయలు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్న ఇల్లెందు మండలంలో ఒక్క గోదాము కూడా నిర్మించలేదు. మార్కెట్‌యార్డు గత పాలకవర్గం ఇల్లెందు మండలానికి ఏసీ గోదాం మంజూరైందని, స్థలం చూపిస్తే నిర్మాణం చేపడుతుతామని హడావుడి చేసింది. స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేసినా ఆతర్వాత అడుగు ముందుకు పడలేదు.

వడ్డించే స్థానంలో మనోడు!

వడ్డించే వాడు మనోడైతే చివరి బంతిలో కూర్చున్నా పర్వాలేదు.. అన్న సామెతను ప్రస్తుతం ఇల్లెందు మండల రైతులు మననం చేసుకుంటున్నారు. ఇంతకాలం స్థానికుడు చైర్మన్ పదవిలో లేకపోవడంతోనే మార్కెట్ ద్వారా ఫలాలు దక్కలేదని భావిస్తున్న ప్రజలు, రైతులు ఈ దఫా మండల వాసి బానోత్ రాంబాబుకు చైర్మన్ గిరి దక్కడంతో దక్కడంతో కొంతైనా ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నారు. ప్రధానంగా రైతు బజార్, సమీకృత మార్కెట్ సముదాయం, ఏసీ గోదాం, ఏజెన్సీ కేంద్రంగా వ్యవసాయ గోదాంల నిర్మాణం జరగాలని కోరుకుంటున్నారు. అయితే కొత్త చైర్మన్ అడుగులు ఎలా వేస్తారో వేచి చూడాల్సిందే.

కలగానే రైతుబజార్

భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లో వ్యవసాయ మార్కెట్ యార్డుల ఆధ్వర్యాన రైతుబజార్లు కొనసాగుతున్నాయి. కానీ సుమారు 400 ఎకరాల్లో కూరగాయల సాగు చేసి ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు ఎగుమతి చేసే ఇల్లెందు మండలంలో మాత్రం రైతు బజార్ ఏర్పాటు కాలేదు. ఆ దిశగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు దృష్టి సారించలేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలాఉండగా 2003లో నాడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు ఇల్లెందు మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి మార్కెట్ కమిటీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించారు. కానీ నాటి మున్సిపల్ పాలకవర్గం అభ్యంతరం తెలిపి.. మార్కెట్ యార్డు ద్వారా దుకాణ సముదాయం నిర్మిస్తే మున్సిపాలిటీకి ఆదాయం రాదని అడ్డు తగిలింది. దీంతో రూ.10లక్షలను బయ్యారం మండలంలో వ్యవసాయ గోదాంల నిర్మాణానికి వెచ్చించారు.



కొమరారంలో గోదాములు లేక శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

వక్కసాగుకు తెలంగాణ అనుకూలం

- నిపుణులతో చర్చించి సాగుకు నిర్ణయం
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల
- ఏపీలోని కామవరపుకోటలో వంట పరిశీలన



వక్క పంట సాగును పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: వక్క పంట సాగు రైతులకు సిరులు కురిపిస్తుందని, తెలంగాణలోనూ ఈ పంట సాగును ప్రోత్సహిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కామవరపుకోటలో వక్క సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు పద్ధతులు, ఆదాయ వ్యయాలపై రైతులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. వక్కసాగుతో రైతులు లక్షల్లో ఆదాయం పొందుతున్నారని అన్నారు. అనేక మంది రైతులు కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర పంటలుగా సాగుచేస్తున్నారని వివరించారు. అన్నదాతలు ఆధునిక సాగువైపు అడుగులు వేయాలని, అధిక ఆదాయం పొందేందుకు ఈ పంటలు చాలా ఉపయోగకరమని అన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వక్కసాగుకు అనుకూలమైన నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి వినియోగం తదితర అంశాలపై నిపుణులతో చర్చించి సాగును ప్రోత్సహిస్తామని తెలిపారు.

సాయిబాబా మృతి తీరని లోటు

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రొఫెసర్ సాయిబాబా మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు నివాళులర్పించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాయిబాబాది రాజ్యపు పరోక్ష హత్య అని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం నిలబడినందుకు, వామపక్ష విప్లవ మేధావిగా ఉన్నందుకే ఆయనను అక్రమ కేసుల్లో ఇరికించి నాగపూర్ అండా సెల్‌లో నిర్బంధించారని, విడుదలైన కొద్ది రోజుల్లోనే మరణించడం విషాదకరమని తెలిపారు. సాయిబాబా కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

అలుగు పారుతున్న 'పాలేరు'

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్ ఫాలింగ్ గేట్ల (అలుగుల) ద్వారా సుమారు 500 క్యూసెక్కుల నీరు పాలేరు ఏటిలోకి విడుదల అవుతోంది. రిజర్వాయర్‌కు సాగర్ నుంచి 4,663 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ఆదివారం నీటిమట్టం 23 అడుగుల గరిష్ట స్థాయికి గానూ 20.35 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి మరో 500 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ఇక రిజర్వాయర్ నుంచి అవుట్ ఫాల్ కాలువ ద్వారా 3,563 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలతో ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేయాలని రైతులు కోరుతుండటంతో ఆదివారం సాయంత్రం కాలువకు నీటిని తగ్గించారు. కానీ సాగర్ నుంచి నీటి సరఫరా నిలపకపోవడంతో రిజర్వాయర్ నీటిమట్టం 20 అడుగులకు మించకుండా ముందుజాగ్రత్తగా ఫాలింగ్ గేట్లను కొంతమేర ఎత్తారు. దీంతో సుమారు 500 క్యూసెక్కుల నీరు అలుగుల ద్వారా ఏటిలో కలుస్తోంది. పాలేరులోని మినీ హైడల్ విద్యుత్ ప్రాజెక్టుకు రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేసే కాలువకు గత వరదల సమయంలో గండి పడగా ఇటీవల గండిని మట్టితో పూడ్చివేశారు. పనులు ఇంకా పూర్తిస్థాయిలో జరగాల్సి ఉన్నందున రిజర్వాయర్‌లో 20 అడుగులకు మించి నీటిమట్టం పెరగకుండా అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు.

రామాలయంలో ఇద్దరికి మెమోలు..?

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో వైదిక కమిటీలో కీలక సభ్యులుగా ఉన్న ఇద్దరికి ఈఓ రమాదేవి మెమోలు జారీ చేసినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. రామాలయంలో జరుగుతున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అర్చకులకు, సిబ్బందికి ఎలాంటి సెలవులు ఇవ్వడం లేదని ఆలయ అధికారులు ముందస్తుగానే నోటీసులు జారీ చేశారు. అయితే దేవస్థానంలో పనిచేసే స్థానాచార్యులు స్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీ కృష్ణమాచార్యులు ఎటువంటి అనుమతి లేకుండానే ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రంలో జరుగుతున్న ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్నారని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరిగింది. దేవస్థానంలో శ్రీరామాయణ పారాయణోత్సవంలో కీలక పాత్ర పోషించే వారు అనుమతులు లేకుండా పాల్గొన్నారని ఆరోపణలు సైతం వినిపించాయి. దీంతో ఆలయ ఈఓ రమాదేవి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిద్దరికీ మెమోలు జారీ చేసినట్లు సమాచారం.